క్లుప్తంగా

నేడు గురుకుల పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలు

బత్తలపల్లి: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల (రేగాటిపల్లి) పాఠశాలలో శనివారం ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ దేవరకొండ మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యుల ఎన్నికల నిర్వహణకు ప్రకటన ఇవ్వడం జరిగిందన్నారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి 1 గంట వరకు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటల్లోపు చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యుల మొదటి సమావేశం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు ఏదైనా గుర్తింపు కార్డుతో ఉదయం 7 గంటలకు పాఠశాలకు చేరుకోవాలని సూచించారు.

అవార్డు గ్రహీతలకు అభినందన

నల్లమాడ: స్థానిక డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్రనాయక్, సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, హౌసింగ్ ఏఈ సుమన్‌నాయక్, తహసీల్దార్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ సంగీత స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మండల సర్పంచులు రజనీకాంత్‌రెడ్డి, కుళ్లాయప్ప, ప్రసాద్, బొజ్జేనాయక్, లింగమూర్తి, ఆనంద్‌నాయక్, ఎస్. అరుణమ్మ, ప్రమీలమ్మ, పార్వతీబాయి, మాసే రెడ్డెమ్మ, రాగినేని సరస్వతి, ప్రభాకర్‌రెడ్డి, భారతి, వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ ఎస్.రామ్మోహన్‌రెడ్డి, ముక్తాపురం రమణారెడ్డి తదితరులు వారికి అభినందనలు తెలిపారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి టౌన్: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, కొండరాజు, జ్యోతిప్రసాద్, సునీల్‌వైట్లా, నరేంద్రబాబు, నారాయణ, కళ్యాణ్, రాజేష్, త్రికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంస



డీఈఓ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీఆర్పీ నరసింహులు

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పని చేస్తున్న సీఆర్పీ నరసింహులు, అటెండర్ సోము స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. వీరికి శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి అవార్డులు అందజేశారు. సీఆర్పీ నరసింహులు, అటెండర్ సోమును కార్యాలయ సిబ్బంది అభినందించారు.

పుస్తకాల పంపిణీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గానగర్‌లో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థినులకు శుక్రవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు నోటు పుస్తకాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు నారాయణ మూర్తి, చిన్నప్ప, మంజునాథ్, వేణుగోపాల్, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో తాగునీటి కష్టాలు



ట్యాంకర్‌తో నీటిని పట్టుకుంటున్న ప్రజలు

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీలో అధికారుల నిర్లక్ష్యం వలన వర్షాకాలంలో కూడా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. మున్సిపాలిటీ పరిధిలో బడేనాయక్ తండా, ప్రశాంతి గ్రామం, ఎనుములపల్లి, 2 వార్డు పెద్ద బజార్‌లో తదితర ప్రాంతాల్లో 8 మోటార్లు కాలిపోయాయి. వాటిని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మున్సిపల్ పాలకవర్గం సభ్యుల మాటలను అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికి తోడు ఎమ్మెల్యే సింధూరరెడ్డి వారానికి ఒక రోజు పుట్టపర్తికి అలా వచ్చి... ఇలా వెళ్తున్నారే తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని సామాన్యులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వరలక్ష్మీ మాతా పాహిమాం



కదిరిలో ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మి అమ్మవారు



చెన్నేకొత్తపల్లి: అలంకరణలో వరలక్ష్మీ దేవత



కనగానపల్లి: టీటీడీ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

కనగానపల్లి: మండలంలోని కుర్లపల్లి గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి మాసోత్సవాల్లో భాగంగా స్థానిక రామాలయంలో టీటీడీ వారు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక మహిళలతో కలసి వరలక్ష్మి వ్రతం పూజలు చేశారు. అంతకుముందు ఆలయం వద్ద పచ్చతోరణాలు కట్టి వరలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, కుంకుమార్చనలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు తమ ఇళ్లల్లో వరలక్ష్మీ అమ్మవారిని కొలువుదీర్చి పలురకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. పూజలు చేసిన వారు తోటి మహిళలకు పసుపు, కుంకమ, ఫల, పుష్పాలు అందజేశారు.

కైవారం సద్గురు యోగి నారాయణ తాతయ్య ఆశ్రమంలో..

చెన్నేకొత్తపల్లి: బసంపల్లి సమీపంలోని కైవారం సద్గురు యోగి నారాయణ తాతయ్య ఆశ్రమంలో శుక్రవారం వరలక్ష్మీ మాతను కొలువుదీర్చి పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 50 ఏళ్లు పైబడిన ముత్తయిదువులకు సామూహిక ఒడి బియ్యం వేశారు. ఏటా వరలక్ష్మి వ్రతం రోజున మహిళలకు ఒడి బియ్యం వేస్తామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

నల్లమాడ: మండల వ్యాప్తంగా వరలక్ష్మి వ్రత వేడుకను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు తమ ఇళ్లలోనే వరలక్ష్మీ మాత విగ్రహాన్ని కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ముత్తైదువులకు పసుపు, కుంకుమ, జాకెట్లు అందించారు. మరికొందరు మహిళలు సమీపంలోని ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

కదిరిలో..

కదిరి టౌన్: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పట్టణంలో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శివాలయం, సైదాపురం ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఉపవాసం ఉండి ఇంట్లోని దేవుని గుడిలో గౌరమ్మను ఉంచి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ముత్తైదువులకు పసుపు, కుంకుమ, సారె అందజేశారు.

తనకల్లు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం భక్తులు మొక్కుబడులను తీర్చుకున్నారు.



కదిరి అడపాల వీధిలో ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మీ దేవత



ధర్మవరం అర్బన్: గాజుల అలంకరణలో పెద్దమ్మ తల్లి



బత్తలపల్లిలో మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

ఆలయాల్లో భక్తుల సందడి

ధర్మవరం అర్బన్/బత్తలపల్లి/తాడిమర్రి/ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలో శుక్రవారం ఇళ్లల్లో వరలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. లక్ష్మీచెన్నకేశవ స్వామి, కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయాల్లో జరిగిన వరలక్ష్మి వ్రతంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బత్తలపల్లిలోని వడ్డెర కాలనీలో వెలసిన మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచి ఆలయ అర్చకుడు రమణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా లక్ష్మీదేవిని అందంగా అలంకరించారు. అర్చకుల ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో వెండి రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. తాడిమర్రిలోని పెద్దమ్మ, పెద్దకోట్లలో చౌడేశ్వరీ దేవి, దాడితోటలోని బాట్ల గంగమ్మ, కునుకుంట్లలోని ఓసూరమ్మ, యల్లమ్మ, తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు వరలక్ష్మి వ్రతం చేశారు. ధర్మవరం పట్టణంలోని సాలేవీధిలో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుగ్గా వంశస్తులు పలు రకాల గాజులతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు వెంకటేష్‌శర్మ అమ్మవారికి పంచామృతాభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం మహిళలు లలితా సహస్ర నామ పారాయణం చేశారు.



తనకల్లులో అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం



దాడితోటలో బాట్ల సుంకలమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



వేంకటేశ్వరస్వామి మూల విరాట్

తలుపుల : మండలంలోని ఓబీఆర్ కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన వేంటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు లక్ష్మీనరసింహస్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులంతా కలసి శాస్త్రోక్తంగా కార్యక్రమం ప్రారంభించారు. ఉదయం పీఠపూజ, వేంకటేశ్వరస్వామి, గణపతి, గోపాలక్రిష్ణ స్వామి ప్రాణప్రతిష్ఠ అనంతరం పలు హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నేడు విగ్రహాల ప్రతిష్ట



అలంకరణలో విగ్రహాలు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని చిన్నపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీరామచంద్ర స్వామి దేవాలయంలో శనివారం సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుడి విగ్రహాలను ప్రతిష్టించనున్నారు. ఇందుకోసం మూడు రోజులుగా వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణలతో పూజలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ప్రాతఃకాల పూజ, విగ్రహాలకు రుద్రాభిషేకం, మూలమంత్ర జపములు, గణపతి, నవగ్రహ, సుదర్శన, ఆది దేవత హోమాలు చేపట్టినట్లు అర్చకులు తెలిపారు. 17వ తేదీ ఉదయం 7:45 గంటలకు విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

జీఓ 171 రద్దు చేయాలి

ఓడీచెరువు: విద్యా వ్యవస్థకు గొడ్డలి పెట్టుగా మారిన జీఓ నెంబర్ 171, 128లను రద్దు చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గౌస్ లాజమ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత సర్దుబాటు ప్రక్రియ ద్వారా కాకుండా అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం ద్వారా ఖాళీలను భర్తీ చేయాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పుట్టపర్తి అర్బన్: మండలంలోని కప్పలబండలో సీహెచ్‌ఓ నగేష్ సీజనల్ వ్యాధులపై అవగాహన ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు జ్వరాల బారిన పడకుండా వ్యక్తి గత పరిశుభ్రత ఎంతో అవసరమన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, ఇంటి సమీపంలో మురుగు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ అపర్ణ, సిబ్బంది ప్రమీల, జ్యోతి తదితరులు ఉన్నారు.

రోగులకు అన్నదానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు రోగులకు అన్నదానం చేశారు. దాతల సహకారంతో దాదాపు 360 మందికి భోజన ప్యాకెట్లతో పాటు గర్భిణులకు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రతి వారం రోగులు, వారి సహాయకులకు భోజన వసతి కల్పిస్తున్నామని సత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న విజయలక్ష్మి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివానగర్‌కు చెందిన వృద్ధురాలు విజయలక్ష్మి కాళ్లనొప్పులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయలక్ష్మి అనే వృద్ధురాలు గత కొంతకాలంగా కాళ్ల నొప్పులతో బాధపడుతోంది. దీంతో మనస్థాపానికి గురై ఇంట్లో గుర్తు తెలియని మాత్రలు అధిక మోతాదులో మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేశారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

బత్తలపల్లి: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో పద్మావతి, శ్రీనివాస కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కళ్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. ఆలయాన్ని చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో అలంకరించారు. ఉత్సవ మూర్తులకు అభిషేకం, అర్చన క్షీరాభిషేకం చేశారు. పురోహితులు ధర్మవరం అవధానం శ్రీనివాసులు, శ్రీనాథ, ఆచార్యులు, పవన్‌కుమార్‌తో కలిసి ఆలయ శాశ్వత ధర్మకర్త పూజారి మంజుల రమణయ్య ఆధ్వర్యంలో పద్మావతి, శ్రీనివాసుడికి ముత్యాల తలంబ్రాలతో కల్యాణం జరిపించారు. తొలుత మహాలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నదానం చేపట్టారు.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఆకట్టుకున్న ఎదురుకోళ్ల ఉత్సవం..

పద్మావతి, శ్రీనివాసుడి కల్యాణోత్సవంలో భాగంగా ఎదురుకోళ్ల ఉత్సవం భక్తులను ఆకట్టుకుంది. పద్మావతి అమ్మవారు, శ్రీనివాసుడి తరఫున పురోహితులు నిలుచుని ఎదురుకోళ్ల ఉత్సవం నిర్వహించారు

ఉపాధి పనులపై ప్రజా వేదిక

గాండ్లపెంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకూ ఉపాధి పథకం కింద చేపట్టిన పనులపై 17వ విడత సామాజిక తనిఖీపై బహిరంగ ప్రజా వేదిక ఏర్పాటు చేశారు. డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో 14 గ్రామ పంచాయతీ గ్రామాల్లో ఎస్‌ఆర్పీ తిరమలేశ్ పర్యవేక్షణలో క్షేత్ర బృందం సభ్యులు ఉపాధి పనులను పరిశీలించారు. పరిశీలనలో సామాజిక బృందం సభ్యులు గుర్తించిన అంశాలను బహిరంగ ప్రజా వేదికలో చదివి వినిపించారు. పీడీ మాట్లాడుతూ సిబ్బంది పని ప్రదేశానికి వెళ్లకపోవడం, పని వద్ద మస్టర్లు చూడకపోవడంతతో ఉపాధిహామీలో జరిమానాలు, రికవరీలు జరుగుతున్నాయన్నారు. మండల వ్యాప్తంగా రూ.5.69 కోట్లతో ఉపాధి హామీ పథకం కింద కూలీలు పనులు చేపట్టగా.. పెనాల్టీ రూ.24 వేలు, జరిమానా రూ.64,802 కలిపి రూ.88,802 సంబంధిత సిబ్బందితో రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో డీబీఓ సుధాకరరెడ్డి, ఏపీడీ రమేష్‌బాబు, సహాయ విజిలెన్స్ అధికారి రాజ్‌కుమార్, ఎంపీడీఓ రామానాయక్, ఏపీఎం సూర్యనారాయణ, ఏపీఓ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి, ఎస్ఆర్పీ, డీఆర్పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ విజేయేంద్ర ప్రసాద్

సభ్యత్వ నమోదు పూర్తి చేయండి



సంబరాలు జరుపుకుంటున్న అసోసియేషన్ సభ్యులు

పుట్టపర్తి అర్బన్: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుర్తింపు దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పుట్టపర్తిలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అసోసియేషన్ జెండాను ఆవిష్కరించారు. జిల్లాలోని కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. భవిష్యత్తులో రాష్ట్ర నాయకత్వం ఎలాంటి కార్యక్రమాలకు పిలుపిచ్చినా అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

నేడు వైద్య సేవలు బంద్

కదిరి టౌన్: పశ్చిమ బెంగాల్‌లోని మెడికల్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా ఒక రోజు వైద్య సేవలను నిలిపివేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి 18వ తేదీ ఉదయం 6 గంటల వరకూ కదిరి ప్రాంతంలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలను నిలిపివేయాలని కదిరి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బ్రాంచ్ నిర్ణయించిందని కదిరి ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ సీవీ మదన్‌కుమార్, సెక్రటరీ డాక్టర్ హుస్సేన్, ట్రెజరర్ డాక్టర్ విద్యాసాగర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బత్తలపల్లి: శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఆర్డీటీ ఆసుపత్రిలో వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఆర్డీటీ ఆసుపత్రి యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

చిరుత సంచారం



మాట్లాడుతున్న ఎస్ఐ లింగన్న

నల్లచెరువు: మండలంలోని జోగన్నపేట పంచాయతీలో చిరుత పులి సంచరిస్తుందని గ్రామస్తులు తెలిపారు. బొమ్మిరెడ్డిపల్లి వద్ద శుక్రవారం రోడ్డు దాటుతున్న చిరుతపులిని చూసిన వాహనదారులు గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్ఐ లింగన్న, అటవీ శాఖ అధికారులు అడుగులను బట్టి చిరుత పులిగా నిర్ధారించారు. చిరుతపులి సంచారం పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

ఆనంద విల్లాస్ దారి క్లోజ్

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ బైపాస్‌లో ఉన్న ఆనంద విల్లాస్‌కు దారి మూసేయడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకెళితే... పరేడ్ గ్రౌండ్ సమీపంలో కమ్మవారిపల్లి వెంకటరాముడు తనకు చెందిన 6 ఎకరాల భూమిలో విల్లాలు నిర్మించేందుకు బిల్డర్ రాధాకృష్ణారెడ్డి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగానే 103 విల్లాల్లో 60 విల్లాలు పూర్తి చేసి కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. విల్లాలు త్వరితగతిన పూర్తిచేయకపోవడంతో వెంకటరాముడు, రాధాకృష్ణారెడ్డికి మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో భూయజమాని వెంకటరాముడు జేసీబీ సహాయంతో 4 అడుగుల గుంతలు తీసి ఆనంద విల్లాల్లోకి వెళ్లే వారికి దారి లేకుండా చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం విల్లా వాసులు, భూయజమానికి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో భూయజమానిపై చర్యలు తీసుకోవాలని అర్బన్ పోలీసుస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. సీఐ సునీత అక్కడకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.



జేసీబీతో రోడ్డుకు అడ్డంగా గుంత తీస్తున్న దృశ్యం

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాం

సాక్షి ఎఫెక్ట్..

గాండ్లపెంట: విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని కదిరి విద్యుత్ ఏడీ సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని మలమీదపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ అంతరాయంపై గురువారం సాక్షి దినపత్రికలో వచ్చిన 4 రోజులుగా అంధకారం కథనానికి ఏడీ శుక్రవారం స్పందించారు. ఏడీ ఫోన్‌లో మాట్లాడుతూ మలమీదపల్లి ఫీడరు 11 కేవీ లైన్ పూర్తిగా పెట్రోలింగ్ చేయించి, సమస్యలను పరిష్కరించి ఎన్‌పీ కుంట మండలం ముదుపలజీవి, అరమడకవారిపల్లి, కరణంవారిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించామన్నారు. ఈ నెల 13న తీవ్రమైన గాలుల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. అదేవిధంగా పంటలను కాపాడుకోడానికి అనధికారికంగా కొంత మంది రైతులు 11 కేవీ విద్యుత్ లైన్‌ను రక్షణగా వినియోగించడం వల్ల.. విద్యుత్ లైన్‌ను జంతువులు తాకినపుడు ఫీడర్ ట్రిప్ జరిగి తరుచూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. అనధికారికంగా పంటలకు విద్యుత్ లైన్ రక్షణగా వేసుకున్న రైతులను గుర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు. వారిపై పోలీసు కేసు నమోదు చేయిస్తామన్నారు. అదే విధంగా గాండ్లపెంట ఏఈ నిర్లక్ష్య ధోరణిపై అధికారులకు చర్యల నిమిత్తం నివేదిక పంపామన్నారు.